క్లుప్తంగా

సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోండి

శిరివెళ్ల: వ్యవసాయ సహకార సంఘాల్లోని రైతులు తమ సభ్యత్వాలను రెన్యూవల్ చేయించుకోవాలని బోయలకుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ దస్తగిరి బుధవారం తెలిపారు. సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ నెల 30వ తేదీ లోపు ఆధార్, పాన్‌కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, 3 ఫొటోలను సహకార సంఘం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

చాగలమర్రి: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని సీఈఓ కె.హుసేన్‌మియ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

తలుపులు తెరుచుకోని హెల్త్ సెంటర్



చిత్రేనిపల్లెలో హెల్త్ సెంటర్‌కు తాళం వేసి ఉన్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని చిత్రేనిపల్లె హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య సిబ్బంది ఎవరూ లేక మూసివేశారు. తలుపులకు వేసిన తాళం కూడా తెరవలేదు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో గ్రామాలు చిత్తడిగా మారాయి. పారిశుద్ధ్యం లోపించడం, దోమల బెడద అధికం కావడంతో ప్రజలు వివిధ రోగాలతో ఇబ్బందులు పడుతున్నారు. అయితే అనారోగ్యాని గురవడంతో హెల్త్ సెంటర్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని, ఉచితంగా మందులు పొందేవారు. అయితే బుధవారం వైద్యకేంద్రం తెరుచుకోకపోవడంతో వైద్యం కోసం వచ్చిన చిత్రేనిపల్లె, ముకుందాపురం గ్రామాలకు చెందిన పలువురు రోగులు చాలా సేపు అక్కడే నిరీక్షించి వెనుతిరిగి వెళ్లారు. వైద్యులు వస్తారని వేచి చూసినా ఫలితం లేకపోండంతో ఆయా గ్రామాల్లోని ప్రైవేటు వైద్యులను ఆశ్రయించారు.

24న వేలం పాటలు

శిరివెళ్ల: ఈ నెల 24వ తేదీన యర్రగుంట్ల శ్రీ రామ, ఈశ్వర స్వామి ఆలయాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామని ఈఓ నర్సయ్య బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 2వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. ఆలయానికి బకాయిలున్న వారు పాటలకు అనర్హులని చెప్పారు.

మంత్రికి సన్మానం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్‌ను నంద్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అధ్యక్షుడు సుబ్బన్న, కార్యదర్శి లక్ష్మణ్ నాయక్‌ల ఆధ్వర్యంలో మంత్రిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజు, దేవేంద్రుడు, భాస్కర్, ప్రేమ్‌కాంత్ బాబు, రాజశేఖర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

డి.కొత్తపల్లె వంక ఆక్రమణ



వంక స్థలం ఆక్రమణకు గురికావడంతో పొలాలకెళ్లే రాస్తాలో నిలిచిన వర్షపు నీరు

చాగలమర్రి: మండలంలోని డి.కొత్తపల్లె గ్రామంలో సుమారు 20 కి.మీ మేర వంకలోనే వర్షపు నీరు కొన్నేళ్లగా ప్రవహిస్తుంది. అయితే ఇటీవల వంక పరివాహక ప్రాంతంలోనున్న కొందరు రైతులు వంకను ఆక్రమించుకోవటంతో, గ్రామం నుంచి వచ్చే వర్షపు నీరు వంకలోకి ప్రవేశించటానికి మార్గం లేక పోవడంతో పొలాలకు వెళ్లే రస్తాలో నిలిచి పోవడంతో రైతులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలయమవుతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

ఉయ్యాలవాడ : వర్షాకాలం ప్రారంభమైంది, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ రఘురాం సూచించారు. బుధవారం మండలంలోని కొండుపల్లె గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ఉద్యోగులకు సంబంధించిన మూమెంట్ రిజిస్టర్, హాజరు రికార్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు నిర్ణీత సమయానికి కార్యాలయం చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా సచివాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. 15 రోజులకు ఒక సారి తప్పనిసరిగా మంచినీటి ట్యాంకులను శుభ్రపరచేలా చూడాలన్నారు.

వాన కురిసింది.. చెరువు నిండింది

- రెండు రోజులుగా భారీ వర్షాలు
- చెరువులకు జలకళ
- రైతుల మోములో దరహాసం



వర్షపు నీటితో కళకళలాడుతున్న రుద్రవరం పెద్దరాజు చెరువు

రుద్రవరం: మండలంలో మంగళ, బుధవారం రెండు రోజుల పాటు భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని కాలనీలు, ప్రార్థన మందిరాలు జలమయమయ్యాయి.అలాగే పంట పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. వాగులు,వంకల్లోనూ ఉధృతంగా నీరు ప్రవహిస్తూ చెరువులకు చేరింది. గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువుల్లో నీరు లేక వెలవెలబోయాయి. గత ప్రభుత్వం విడతల వారీగా తెలుగుగంగ కాల్వలకు నీరు విడదల చేయడంతో చెరువుల్లో కాస్తో కూస్తో నీరు ఉండింది. వాటిని కొద్ది రోజులకే చేపల పట్టివేత కోసమని తోడేయటంతో చెరువులన్నీ ఖాళీగా మారాయి. మూగ జీవాల దాహార్తి తీర్చుకునేందుకు కూడా నీరు లేక పోవడంతో రైతులు, పశుపోషకులు ఇబ్బందులుపడ్డారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు పడటంతో భూగర్భ జల మట్టం పెరిగింది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో స్థానిక పెద్దరాజు చెరువు, కొండమాయపల్లె చెరువు,బీ.నాగిరెడ్డిపల్లె, మాచినేనిపల్లె గ్రామాల పరిధి ల్లోని చెరువులకు నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో నీరు చేరడంతో వాటి పరిధిలో బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే తాగునీటికి ఇబ్బందులు ఉండవని, వర్షాలు కొనసాగితే పంటల సాగుకు నీటి ఇక్కట్లు తలెత్తవని పేర్కొంటున్నారు.



నిండు కుండలా కొండమాయపల్లె చెరువు

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వీడాలి



నడిగడ్డలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్యం లోపించరాదన్నారు. రోజూ మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, రోజు వారీగా వెలువడుతున్న చెత్తను ఎప్పటికప్పుడు డంప్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. 12వ వార్డు బాలజీ కాంప్లెక్స్‌లోని ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం నిల్వ ఉండి దోమలు అధికమవుతున్నాయని, 3వ వార్డు నడిగడ్డ, సలీం నగర్ ప్రాంతాల్లోని సామూహిక మరుగుదొడ్ల వద్ద పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ చేయాలని సూచించారు.

'ఉపాధి'కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాశ్

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఆ శాఖ ఏపీఓ రవిప్రకాశ్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో వర్షాలు కురుస్తుండడంతో కూలీల సంఖ్య తగ్గిందన్నారు. ప్రభుత్వం పెంచిన రోజువారి వేతనం రూ. 300పై క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గాయని కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. అలాగే ఉపాధికి సంబంధించిన వర్క్ ఫైల్స్‌లోని 14 అంశాలు, 7 రకాల రికార్డుల నమోదులో అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. పని ప్రదేశాలలో తప్పనిసరిగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

వంద ఎకరాల్లో పండ్ల తోటలు..

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం వంద ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీతో ప్రోత్సాహాన్ని కల్పిస్తూ లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, తుడుమలదిన్నె, సుద్దమల్ల, రూపనగుడి, సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాలలో 74 ఎకరాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్స్ సాగు చేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని వివరించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హరినగరంలో చెంచులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అమర్నాథ్ రెడ్డి

రుద్రవరం: వర్షాల కాలం మొదలైందని, ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్నాథ్‌రెడ్డి చెంచులకు సూచించారు. మండలంలోని హరినగరంలో పీఎం జన్‌మన్‌లో భాగంగా బుధవారం హరినగరం చెంచులకు సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన సికిల్‌సెల్,అనిమియా సోకే విధానం,వాటి లక్షణాలను వివరించారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, గర్భధారణలో సమస్యలు, అవయవ నష్టం ఇలాంటివెన్నో ఉంటాయని వివరించారు. అనంతరం గ్రామంలోని 331 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది,నాయకుడు నాగముని ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన అవసరం

గోస్పాడు: రక్తహీనతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవలసిన అవసరముందని వైద్యాధికారి గోపాల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ప్రజలకు రక్తహీనతపై హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ అవగాహన సమావేశం నిర్వహించారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరుచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలు, అవయవ వైఫల్యం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే సంబంధించిన వైద్యులను సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి



ఖాతాదారులతో మాట్లాడుతున్న నాగనాయక్

నంద్యాల(అర్బన్): పోస్టాఫీసు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ నాగనాయక్ తెలిపారు. పోస్టాఫీసుల్లో ఖాతాదారులకు అందుతున్న సేవలపై బుధవారం మండలంలోని పోలూరు గ్రామ సబ్ పోస్టాఫీసులో ఎస్‌బీఎం అలీసాతో కలిసి ఆర్‌పీఎల్‌టీ, పీఎల్‌టీ, ఎస్‌ఎస్‌ఏ తదితర పాలసీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అత్యంత నమ్మదగిన పాలసీల సంస్థల్లో పోస్టాఫీసు నమ్మకమైనదన్నారు. ప్రతి ఖాతాదారుడు ఆత్మవిస్వాసంతో పాలసీలు చేసి పోస్టాఫీసుల అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

బహిరంగ వేలంతో ఆదాయం



బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన శ్రీ ఆంజనేయ కోదండరామస్వామి ఆలయ భూములు, దుకాణాలకు సంబంధించిన బహిరంగ వేలంలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం అదనంగా ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఆంజనేయశర్మ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ భూముల వేలంలో గత సంవత్సరంలో రూ.2.60 లక్షలు రాగా ఈ సంవత్సరం రూ.3.06 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం రూ.46 వేలు అధికంగా రాబడి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఆలయ దుకాణాలకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా గతేడాది రూ.13,500 రాగా ప్రస్తుతం రూ.17,600 వచ్చిందన్నారు. కోటపాడు గ్రామ ఆలయ ఈఓ వేణునాథరెడ్డి, బాలకృష్ణ, అంజి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిషప్

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

గోస్పాడు: మండలంలోని ఎస్.కూలూరు గ్రామంలో చర్చి నిర్మాణానికి నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ ది రైట్ రెవరెండ్ డాక్టర్ టీ.జార్జ్ కార్నలియస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బిషప్ పునాది రాయి వేశారు. కార్యక్రమంలో రైట్ రెవరెండ్ పీఏ వరప్రసాద్ బాబు, రెవరెండ్ కే. జోసఫ్‌బాబు, జీవన్ బాబు, సువార్తబాబు, నంద్యాల డయాసిస్ సెక్రటరీ స్టాన్లీ విలియమ్స్, గోస్పాడు పాస్టరేట్ చైర్మన్ రెవరెండ్ విజయానంద్ పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ బిషప్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

యువతకు ఆదర్శం ఛత్రపతి శివాజీ

నంద్యాల(వ్యవసాయం): నేటి యువత ఛత్రపతి శివాజీ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవా భారతి కర్నూలు విభాగ్ రఘురాములు పేర్కొన్నారు. హిందూ సంప్రదాయ దినోత్సవం, శివాజీ పట్టాభిషిక్తుడైన రోజును పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శివాజీ పోరాట స్ఫూర్తి, బుద్ధి కుశలత, పరిపాలన దక్షత, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవ చేయాలని కోరారు. స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



యర్రగుంట్లలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

శిరివెళ్ల: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం యర్రగుంట్లలో రైతులకు జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు కావలసిన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు సబ్సిడీపై అందజేస్తారని చెప్పారు. జింక్, జిప్సం కూడా రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ నాగేంద్ర ప్రసాద్, ఏఓ సుధాకర్, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న రూరల్ సీఐ హనుమంతనాయక్

ఆళ్లగడ్డ: త్వరలో అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై ఎస్‌ఐలు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ హనుమంతనాయక్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆళ్లగడ్డ రూరల్, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బందికి కొత్తచట్టాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూలై 1నుంచి భారతీయన్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత,భారతీయ సాక్ష్య అధినియం అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాల్లో అనేక కొత్త నిబంధనలు చేర్చారని చెప్పారు. బాధితుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడంపై క్లుప్తంగా వివరించారు. ఎస్‌ఐలు నరసింహులు, రమణయ్య, సురేష్, రామాంజనేయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్): జంప్‌రోప్ క్రీడాకారుడు రిషిక్ నాగేష్ ఈ ఏడాది జపాన్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గోవాలో నిర్వహించే శిక్షణకు వెళ్తుండటంతో డాక్టర్ రామకృష్ణారెడ్డి బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పీవీ సుబ్బారెడ్డి, సుధాకర్, కాటసాని శ్రీనివాసరెడ్డి, తిమ్మయ్య, రమణ, యోగా మాస్టర్ రమేష్ ఉన్నారు.

ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

నంద్యాల(న్యూటౌన్): ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం పట్టణ కార్యదర్శి నరసింహులు, సీనియర్ నాయకులు తోటమద్దులు అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, మరోవైపు నిత్యావసర, కూరగాయల ధరలు పెరిగిపోవడంతో అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ధరలను అదుపు చేయాలని కోరారు. గౌస్, లక్ష్మణ్, శివ, వీరసేన పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): అర్బన్ హెల్త్ కేర్ సెంటర్లలో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తమను తిరిగి విధులలోకి తీసుకోవాలని ఏపీ పట్టణ ఆరోగ్య కేంద్రాల కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ అధ్యక్షురాలు దేవమ్మ, కార్యదర్శి బుజ్జమ్మ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టణ ఆరోగ్యకేంద్రాలను అపోలో ఏజెన్సీలకు అప్పగించారన్నారు. హెల్త్ కేర్ సెంటర్లలో పనిచేస్తున్న తమను ప్రభుత్వం డీఎం అండ్‌హెచ్‌ఓ ద్వారా ఏజెన్సీలకు అప్పగించిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఏజెన్సీల గడువు ముగియడంతో ఉద్యోగాలు అగమ్యగోచరంగా తయారయ్యాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 200 మంది ఏఎన్‌ఎంలను విధులలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా అధికారి దురుసు ప్రవర్తన

- కాంట్రాక్ట్ ఉద్యోగిపై చేయి చేసుకున్న వైనం

నంద్యాల(అర్బన్): తక్కువ వేతనాలతో ఎన్నో ఏళ్లుగా హాస్టల్ విద్యార్థులకు సేవలందిస్తున్నా కాంట్రాక్ట్ వర్కర్లను అధికారులు చిన్న చూపు చూస్తున్నారనే విమర్శలున్నాయి. 22 సంవత్సరాలుగా నంద్యాల పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో కాంట్రాక్ట్ వర్కర్‌గా సేవలందించిన రమాదేవి బదిలీ విషయంపై బుధవారం జిల్లా అధికారిణితో వాగ్వాదం చోటు చేసుకుంది. ఏడు మాసాల క్రితం వరకు పట్టణంలోని దేవనగర్ బీసీ హాస్టల్‌లో విధులు నిర్వర్తిస్తున్న రమాదేవిని బొమ్మల సత్రం వద్ద ఉన్న బాలికల సమీకృత వసతి గృహానికి జిల్లా అధికారిణి బదిలీ చేయించింది. అయితే పది రోజుల క్రితమే తిరిగి దేవనగర్ బీసీ హాస్టల్‌కు బదిలీపై వచ్చిన రమాదేవిని బనగానపల్లెకు బదిలీ చేస్తున్నామంటూ జిల్లా అధికారిణి ఆదేశించారు. బదిలీలపై విసిగిపోయిన రమాదేవి.. తనకు వచ్చే చాలీచాలని వేతనంతో అంత దూరం వెళ్లి విధులు నిర్వహించలేనని వాపోయింది. దీంతో స్పందించిన జిల్లా అధికారిని..బదిలీపై వెళ్లకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడమే కాకుండా రమాదేవిని దుర్భాషలాడుతూ తోసి వేసినట్లు సమాచారం. సహ ఉద్యోగులు సర్దిచెప్పడంతో సమస్య సర్దుమనిగింది.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఆళ్లగడ్డ: తమ ఇంటిపైకి వచ్చి దౌర్జన్యం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కాశింబీ కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన కొందరు వ్యక్తులు తమ ఇంట్లోకి వచ్చి దౌర్జన్యం చేసి వస్తువులన్నీ పట్టుకు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని, ఇప్పటికైనా వారిపై కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లోనున్న ప్రభుత్వ పాఠశాలల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని ఎంఈఓ బ్రహ్మం నాయక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామాల్లో అక్షరాస్యత శాతం బాగా పెరిగిందని, బడి ఈడు పిల్లలంతా బడుల్లోనే ఉండేలా చూడాలని చెప్పారు.



ప్రాథమిక పాఠశాలలో చేరిన అంగన్‌వాడీ చిన్నారులు

పాఠశాలలో చేరిక

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–1 లోని ఐదేళ్లు నిండిన చిన్నారులను స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పినట్లు హెచ్‌ఎం రాజేశ్వరి బుధవారం తెలిపారు. వీరందరికీ వెంటనే మొదటి తరగతికి అడ్మిషన్లు ఇచ్చి పుస్తకాలు అందజేసినట్లు చెప్పారు. అంగన్‌వాడీల నుంచి వచ్చే చిన్నారులు చాలా చలాకీగా ఉంటు చదువు పరంగా ముందంజలో ఉన్నారన్నారు. ముఖ్యంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య చాలా అవసరమని చెప్పారు. వెల్ఫేర్ అసిస్టెంట్ రియాజాబీ, అంగన్‌వాడీ కార్యకర్త తులసమ్మ ఉన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ ఓ లలిత, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శివప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ రక్తహీనత అనీమియా దినోత్సవాన్ని శ్రీరామకృష్ణ పీజీ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గర్భాధారణ సమయంలో సమస్యలు లాంటి వ్యాధి లక్షణాలు ఉంటాయని చెప్పారు. వైద్యులు జగదీష్ చంద్రారెడ్డి, కాంతారావు, సునీత, ప్రసన్న లక్ష్మి, భరత్,శ్రీజ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో బుధవారం సికిల్ సెల్ అనిమియా డే సందర్భంగా స్థానిక చెంచు కాలనీలో గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, నాయక్, ఏఎన్‌ఎం గార్లెట్ పాల్గొన్నారు.